# సదా మీ సేవలో...

"ఇవాళ మీ పత్రిక్కి మంచి విశేషం చెప్తానయ్యా! సూరమ్మ అని ఒక నిజాయితీపరురాలు మా పోలీస్‌స్టేషన్‌కి వచ్చింది. ఒకటీ, రెండూ కాదు అక్షరాలా అయిదువేల రూపాయలు దొరికితే పట్టుకొచ్చి ఇచ్చింది. మనిషిని చూస్తే చింకిబట్టలూ, అదీ ...దమ్మిడీ లేనట్టుంది. అయితే ఐదువేలు కనబడగానే ఆశపుట్టి దగ్గర ఉంచేసుకోకుండా స్వంతదారులకు అప్పచెప్పేయండి అంటూ నా దగ్గరకు వచ్చింది. లోకంలో నీతి, నిజాయితీ ఇంకా బతికే ఉన్నాయని మీ పత్రికలో రాయవయ్యా!" అన్నాడు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్ యోగేష్.

తెలుగుతేజం పత్రిక విలేఖరి కళ్లెగరేశాడు. "రోజూ మీ దగ్గరకొచ్చి దొంగతనాలు, దోపిడీల వార్తలు రాసుకుని వెళ్లి ఇవ్వడం ఆనవాయితీ అయిపోయింది. ఇలాటి నాలుగు వింత వార్తలు చెబితే నాకూ రిలీఫ్‌గా ఉంటుంది. బాక్స్ కట్టి మరీ వేద్దాం న్యూస్. ఇంతకీ డబ్బు స్వంతదారు దొరికాడా?"

"ఇంకా లేదు. ఆ డబ్బు రకరకాల డినామినేషన్స్‌లో ఉంది. ఏ నోట్లు ఎన్ని ఉన్నాయో, అవి దేనిలో పెట్టి ఉన్నాయో కరెక్టుగా చెప్పి, మా దగ్గరనుండి పట్టుకెళ్లవచ్చు. ఓ నెల్లాళ్లు చూసి, సరైనవాళ్లు ఎవరూ రాకపోతే ఆ డబ్బు ఆమెకే తిరిగి ఇచ్చేస్తాం. పాపం, వితంతువట. పిల్లా, పాపా ఎవరూ లేరు. మధ్యవయస్కురాలు. తిండి తిని ఎన్నాళ్లయినట్టో ఉంది. ఏమైనా దొంగల్ని చూసి చూసీ విసుగెత్తిన మాకు ఇటువంటి వాళ్లు కనబడితే ప్రాణం లేచి వచ్చినట్టుగా ఉంటుంది!" అన్నాడు యోగేష్.

నాలుగు రోజుల తర్వాత సూరమ్మ పోలీసుస్టేషన్‌కి వచ్చినప్పుడు యోగేష్ పలకరించాడు "ఎక్కడకెళ్లావమ్మా? నీ గురించి నేనే వెతుకుదామనుకున్నాను. మొన్నో జర్నలిస్టు వచ్చినప్పుడు నీ గురించి చెబితే అతను, వాళ్ల పేపర్లో ఈ జోన్ సప్లిమెంట్‌లో వార్త వేసేశాడు. అది చదివి, ఈ లోకాలిటీలో ఉన్న వాళ్లెందరో ఫోన్లమీద ఫోన్లు. 'అలాటి నిజాయితీపరురాలికి ఉద్యోగం ఇస్తాం. ఎక్కడుందో చెప్పండి' అంటూ."

"అంతా మీ చలవండీ! మీరే ఏదైనా మంచి ఇల్లు చూపించండి. ఇంట్లో ఉండి అన్ని పనులూ చేసి పెడతాను. బతికిచెడినదాన్ని. నాకు ఇల్లు చక్కదిద్దుకోవడం, గొప్పవాళ్ల ఇళ్లల్లో పద్ధతులు, మర్యాదలు అన్నీ తెలుసు. ముందూ వెనకా ఎవరూ లేనిదాన్ని. నన్ను అభిమానంగా చూసుకునే వాళ్లెవరో మీరే చూసి చెప్పాలి!" అని ప్రాధేయపడింది సూరమ్మ.

యోగేష్ చిరునవ్వు నవ్వాడు. "మొత్తానికి నా మీదే పెట్టావే! చూడు. నిన్ను చూడగానే నాకు ఓ విధమైన గౌరవం కలిగింది. అందుకే నీ కోసం అడుగుతూ ఫోన్లు చేసినవాళ్ల వివరాల్ని రాసిపెట్టాను. నీకు పనిచేయడానికి మంచి ఇల్లు ఏదైనా చూద్దామనుకున్నాను. నువ్వే అడిగావు. ఇదిగో!" అంటూ ఒక కాగితం ఇచ్చాడు.

సూరమ్మ అవన్నీ జాగ్రత్తగా చదివి, ఒకటి ఎంచుకుని యోగేష్‌కి చూపించింది.

"వచ్చినవాటన్నిటిలోనూ అన్నిటికంటే ఒక విధంగా మంచి ఆఫరే ఎంచుకున్నావు. డాక్టర్ జగన్నాథ్ మంచివాడు. పేరు ప్రఖ్యాతులు, డబ్బు సంపాదించుకుంటున్న డాక్టరు. బ్రహ్మచారి. ఇంట్లో పెద్దగా పని ఉండదు. కానీ..."

"కానీ అంటున్నారు, బ్రహ్మచారి కాబట్టి జాగ్రత్తగా ఉండమనా? నడివయసుకి వచ్చేశాను!"

"అబ్బే, అలా అని కాదు. అక్కడ పనిచేస్తానంటున్నావు కాబట్టి చెబుతున్నాను. తక్కిన వాళ్లకంటే

పోలీసువాళ్లకు కొన్ని విషయాలు ఎక్కువగా తెలుస్తాయిగా. అందుకని చెబుతున్నాను. ఆయనకు ఇద్దరితో సంబంధం ఉందిట. ఒకావిడ వివాహితురాలు. మరొకరు పెళ్లికాని పిల్లట. మనుషులెవరో మాకూ తెలియదు. చివరికి ఎవర్ని పెళ్లి చేసుకుంటాడో తెలియదు. వాళ్లు రావడం, పోవడం నీకంతా న్యూసెన్స్‌గా ఉంటుందేమో. పోనీ, రోడ్ నంబరు 4 లాయరు గారి..."

"గొప్పవారి గోత్రాలన్నీ ఇలాగే ఉంటాయండీ! డాక్టరు గారి ప్రేమ వ్యవహారాలతో నాకేం పని? మనిషి స్వతహాగా మంచివాడయితే చాలు!"

"అయ్యో, అందులో సందేహం లేదు. కావాలంటే నేను ఇప్పుడే మాట్లాడతాను. ఇవాళే పనిలో చేరవచ్చు."

నెల్లాళ్ల తర్వాత సూరమ్మ యోగేష్‌ని కలవడానికి వచ్చింది. ఆమెకు దొరికిన డబ్బు క్లెయిమ్ చేయడానికి సరైన వాళ్లు ఎవరూ రాకపోవడం. వచ్చినవాళ్లు ఏ నోట్లు ఎన్ని ఉన్నాయో కరెక్టుగా చెప్పలేకపోవడంతో సూరమ్మకే తిరిగి ఇచ్చేస్తానని కబురంపడంతో ఆమె వచ్చింది. యోగేష్ ఆమె యోగక్షేమాలు అడిగాడు, ఆమె రూపురేఖలు, కట్టు, బొట్టు చాలా మెరుగైన విషయం గమనిస్తూనే.

సూరమ్మ సిగ్గుపడింది. "డాక్టరుగారు బాగానే చూసుకుంటున్నారు. ఆయన ఇచ్చిన అడ్వాన్సుతో మంచి బట్టలు కుట్టించుకుని పార్టీల్లో వాటిల్లో దర్జాగా కనబడేసరికి ఆయన మురిసిపోయారు. పైకొస్తున్న డాక్టరు కదా, పలుకుబడి పెంచుకోడానికి తరచుగా పార్టీలు ఇస్తుంటారు. నేను వచ్చాక పార్టీల ఏర్పాటు బాగుందని అందరూ అనడంతో ఆయన చాలా సంతోషించి నాకు బహుమతులిస్తున్నారు."

"నీకు పార్టీలు ఏర్పాటు చేయడంలో అనుభవం ఎలా ఉంది?" అని అడిగాడు యోగేష్ ఆశ్చర్యంగా.

"నిజం చెప్పమంటారా, బాబూ! నేను పెద్ద కుటుంబందాన్నే. ఇంట్లో నౌకర్లు, చాకర్లు ఉన్నదాన్నే. మా వారు పేకాటలో సర్వస్వం పోగొట్టేశారు. ఆస్తిపోయిన దిగులుతోనే మంచం పట్టి తీసుకుని పోయారు. మిగిలినదేమైనా ఉంటే ఆయన వైద్యానికి ఖర్చయిపోయింది. నా కర్మ ఇలా కాలింది. అందుకే డబ్బున్నవాళ్ల ఇళ్లల్లో పనిచేయడమంటే నాకు సులభం. వాళ్లు నిజాయితీపరులు కాదు కాబట్టి వాళ్లకింద పనిచేసే వాళ్లు విధిగా నిజాయితీపరులవ్వాలని కోరుకుంటారు. పనివాళ్లు దర్జాగా, అందంగా ఉండాలి. కానీ తక్కువ స్థాయిలో ఉండాలి. నా అసలు పేరు సూర్యముఖి. ఆ పేరు చెబితే ఎవరైనా ఉద్యోగం ఇస్తారా? ఇవ్వరు. అందుకే సూరమ్మ అని చెబుతాను."

యోగేష్ నవ్వాడు. "ఏమో అనుకున్నాను. దేవాంతకురాలివే! అవునూ, డాక్టరుగారు నీకిలా బహుమతులు ఇచ్చేస్తూంటే ఆయన ప్రియురాళ్లు ఊరుకున్నారా? ఓ విషయం చెప్పు. వాళ్లిద్దరిలో ఆయన ఎవరిని పెళ్లాడతాడంటావు. జస్ట్ క్యూరియాసిటీ. అంతే. ఇష్టం లేకపోతే పేర్లు చెప్పద్దులే. అసలు ఇద్దరు ప్రియురాళ్లు ఉన్నారా లేరా?"

యోగేష్ ఉబలాటం చూసి సూరమ్మ నవ్వింది. "మీరు అడిగినా పేర్లు చెప్పను. ఇద్దరయితే ఉన్నారు. ఒకావిడ పెళ్లయినావిడ. ఈయనకంటే పదేళ్లు పెద్దది. ఆవిడ భర్త పెద్ద వ్యాపారస్తుడు. ఈవిడ గురించి పట్టించుకునే టైము లేదాయనకు. డాక్టరు గారు ప్రాక్టీసు మొదలుపెట్టిన కొత్తల్లో ఆవిడ పలుకుబడి చాలా ఉపయోగపడింది. ఇప్పుడు ఆయన పైకొచ్చాక ఇంకో చిన్నపిల్లతో పరిచయం పెరిగింది. ఈయనకంటే పదేళ్లు చిన్నది. చాలా డబ్బున్న తండ్రికి ఏకైక వారసురాలు. తండ్రి చాలా చాదస్తుడు. పెళ్లికి ముందు ప్రేమ వ్యవహారాలంటే చంపేస్తాడు. అందుచేత ఆయనకి తెలియకుండా వ్యవహారం నడుపుతోంది. డాక్టరుగారు చాలా మంచివాడనే ఆయన అభిప్రాయం."

"ఎవరాయనా? రాజశేఖరంగారా?"

"పేర్లు చెప్పనన్నానుగా! కొద్ది రోజుల్లో పెళ్లి నిశ్చయం కాబోతోంది. అప్పుడు మీకే తెలుస్తుంది. ఈ పెళ్లయినావిడకు కోపం, డాక్టరు గారు తన చేయి జారిపోతున్నాడని. ఆ అమ్మాయి తండ్రికి డాక్టరుగారు స్త్రీలోలుడని చెప్పి, సంబంధం చెడగొట్టేస్తానని బెదిరిస్తూ ఉంటుంది. అవసరం తీరాక తనను వదిలించుకోడానికి చూస్తున్నాడని డాక్టరుమీద అరుస్తూంటుంది."

"బాగానే ఉంది వ్యవహారం. ఈ గొప్పవాళ్ల ఇళ్లలో జరిగే తమాషా ఏమిటంటే, ఇవేమీ పోలీసులదాకా రావు. ఇదే అలగాజనమయితే పొడిచేసుకోవడమో, ఏదో జరిగిపోతుంది. వీళ్లతో ఆ బాధ లేదు. అంతా చాటుమాటే. పోనీలే, మాకున్న తలకాయనొప్పులు చాలు. అది సరేగానీ, డాక్టరుగారు ఎవర్ని పెళ్లిచేసుకుంటే నీకు లాభం?"

సూరమ్మ ఫక్కున నవ్వింది. "బావుంది. నా లాభనష్టాలు ఆలోచించి డాక్టరుగారు పెళ్లిచేసుకుంటారా? నిజం చెప్పాలంటే డాక్టరుగారు చిన్నావిణ్ని పెళ్లి చేసుకుంటే నాకు నష్టమే. ఆవిడకు నేనంటే పడదు. ఎందుకంటే ఆవిడకు డాక్టరుగారు, ఆయన ఇల్లు, ఆయన సర్వస్వంపై ఆధిపత్యం కావాలి. నా మీద డాక్టరుగారు అభిమానం చూపిస్తున్నాడని తెలుసు కాబట్టి ఇంటావిడగా రాగానే నాకు ఉద్వాసన చెప్పేస్తుంది. పెద్దావిడతో ఆ పేచీ లేదు. ఆవిడకు కావలసినది డాక్టరు గారి ప్రేమ మాత్రమే. ఆయన అవసరాలు గమనించేందుకు నేనుంటే ఆవిడకు సుఖం. ఈ ఇద్దరి మధ్యా నలుగుతున్న డాక్టరు గారిని చూస్తూంటే జాలివేస్తోంది నాకు."

ఇన్ని విషయాలు చెప్పిన సూరమ్మ యోగేష్‌కి ఒక విషయం మాత్రం చెప్పలేదు. డాక్టరు గారి ప్రియురాళ్లిద్దరి మధ్య గొడవలు పెంచుతున్నది తనేనని. ముఖ్యంగా లలిత వచ్చి అడగ్గానే, కుమారి తన తండ్రి కన్నుకప్పి ఆ రోజు ఎంతసేపు డాక్టరు గారితో గడిపిందో పూసగుచ్చినట్టు చెప్పేది. లలిత మొగుడు ఊరు వెళ్తున్నాడని తెలియగానే కుమారికి ఫోన్ చేసి చెప్పేది. కుమారి వెంటనే వచ్చేసేది. ఆలస్యం అయితే లలిత వచ్చి ఇంట్లో తిష్ట వేస్తుందని. వీళ్లద్దరి గొడవలతో డాక్టరు చాలా విసిగిపోయాడు. పిచ్చిపట్టినట్టు ప్రవర్తించేవాడు. అతన్ని ఓదార్చి సేదదీర్చేది సూరమ్మే. ఆమె అంటే అతనికి ఎంత మమకారం పుట్టుకొచ్చిందంటే తన ఇంట్లో పని ఎన్నడూ మానవద్దనీ, తన విల్లులో ఓ లక్ష రూపాయలు ఆవిడ పేర రాస్తానని అనేవాడు.

కుమారితో డాక్టరుగారి నిశ్చితార్థం జరిగాక లలిత అల్లరి మరీ ఎక్కువైపోయింది. తన భర్తను వదిలి వచ్చేస్తాననీ, తనను పెళ్లి చేసుకోమనీ గొడవపెట్టేది. డాక్టరు మరీ కటువుగా మాట్లాడలేకపోయేవాడు. ఇదివరకు ఉపకారం పొంది ఉన్నాడాయె. "మీ ఆయనకు మనమధ్య జరిగే వ్యవహారం గురించి బొత్తిగా తెలియదు కదా, సడన్‌గా చెప్తే తట్టుకోలేడు. విడాకులివ్వనంటాడు!" అనేవాడు నవ్వుతూ. "ముందు నువ్వు సరేనను, తర్వాతి సంగతి నేను చూసుకుంటాను!" అనేది లలిత.

వాళ్ల నాన్న ఊళ్లో లేకుండా చూసి కుమారి వచ్చి డాక్టరు ఇంట్లో పడకగదిలో బిచాణా పెట్టేసింది. ఒక ముఖ్యమైన ఆపరేషన్‌కి వెళ్లబోతుంటే డాక్టరుని ఆపేసింది. ఇక తప్పక ఇంట్లో ఉండిపోయాడు డాక్టరు. సాయంత్రానికి కబురు వచ్చింది, ఆ పేషెంటు చచ్చిపోయాడని. డాక్టరు చిరాకు పెరిగిపోయింది.



ఇలా అయితే తన ప్రాక్టీసు ఏం కావాలని అతని బాధ. ఏం వర్రీలేదంటున్న కుమారిని చూస్తే ఉక్రోషం, కోపం.

ఈ బాధలో ఇలా ఉండగానే అర్ధరాత్రి లలిత దిగబడింది. సూరమ్మ తలుపు తీయగానే, "ఏడి వాడు?" అంది, డాక్టర్ని చూస్తూనే "నా సంగతి ఏం చేశావు?" అంది. తాగి ఉంది. ఒంటిమీద బట్టలు

అస్తవ్యస్తంగా ఉన్నాయి.

"చేసేందుకేముంది? నువ్వు ప్రస్తుతానికి ఇంటికెళ్లు!" అన్నాడు డాక్టరు.

"నేను వెళ్లను. మన సంగతి డిస్కస్ చేద్దాం!" అంది లలిత మేడమీదున్న పడగ్గదికి దారి తీస్తూ.

"నువ్వు ముందు ఇంటికెళ్లు! క్రితం వారం కూడా మీ ఆయన ఊరెళ్లగా చూసి మూడు రోజులు పగలూ, రాత్రీ ఇక్కడే ఉండిపోయావు. సంఘంలో పేరున్న డాక్టర్‌ని. పెళ్లి నిశ్చయమైన వాణ్ణి. నా సంగతి ఆలోచించవేం? ఇవాళ నా మాట విని, వెళ్లిపో! ఇప్పుడు నీ పరిస్థితి బాగాలేదు. పొద్దున్న క్లినిక్‌కి రా, మాట్లాడదాం!" అన్నాడు డాక్టరు అడ్డుపడుతూ.

"నా సహాయంతో ప్రాక్టీసు పెంచుకున్నప్పుడు గుర్తుకురాలేదా ఈ పరువూ, అదీ? ఈ రోజే తేలిపోవాలి, అదో, నేనో! ముందు లోపలికి పక్కమీదకు పద! ఒళ్లు, బుర్ర చల్లబడితేనే తక్కిన మాటలు!" అంటూ డాక్టర్ని పట్టుకుని మేడమెట్ల మీదకు లాగింది.

"నో, నో! బెడ్‌రూమ్‌కి వద్దు!" అన్నాడు డాక్టరు కంగారుగా. ఒక్కసారిగామత్తు దిగిపోయింది లలితకు. "ఎందుకు వద్దు? ఓహో, ఇప్పటిదాకా స్వర్గసుఖాలు అనుభవించి కుమారిగారు నిద్రిస్తున్నారన్నమాట! వెరీగుడ్! ఏ పరిస్థితిలో ఉందో చూడనీ! చూసి వాళ్ల నాన్నకి ఫోన్ చేసి చెబుతా. వాళ్ల ముద్దుల కూతురు, కాబోయే అల్లుడూ పెళ్లికి ముందే ఎలాంటి సరసాలు వెలగబెడుతున్నారో తెలుసుకుంటాడు, పాపం. చాదస్తుడు కదా. తట్టుకోలేడు. పెళ్లి కాన్సిల్ అంటాడు. అదే నాకు కావాలి!" అంటూ రివ్వున పరుగెత్తింది లలిత.

డాక్టరు హడావుడిగా ఆమె వెంట పరుగెత్తి ఆమెను ఆపబోయాడు. ఆమె విదిలించుకోబోయి రెయిలింగ్ మీద పడింది. పడినా డాక్టరు పట్టు విడిపించుకోవడానికి పెనుగులాడడంతో డాక్టరు కూడా రెయిలింగ్ మీద పడ్డాడు. ఇద్దరి బరువూ ఆపలేక రెయిలింగ్ విరిగి కిందపడటం, లలిత తల పాలరాతి విగ్రహం దిమ్మ అంచుకి తగిలి తల వాల్చేయడం జరిగింది. రక్తం చూడగానే డాక్టర్ బిత్తరపోతూ, నాడి చూశాడు. అప్పటికే ఆమె ప్రాణాలు పోయాయి.

ఆ తరువాత పావుగంటదాకా డాక్టరు సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూనే ఉన్నాడు. చివరికి నోరు పెగిల్చాడు. "సూరమ్మా! ఇదంతా నీ కళ్లెదురుగానే జరిగింది. నా తప్పేమీ లేదని నీకు తెలుసు. కానీ పోలీసులు, ప్రజలు నమ్మరు. నా పెళ్లి ఆగిపోతుంది. ఇన్నేళ్లుగా సంపాదించుకున్న నా పరువు ప్రతిష్ఠలు మంటగలుస్తాయి. ఈ శవాన్ని ఇక్కడనుండి తీసి ఎక్కడైనా పారేస్తే చాలు, అప్పుడు శవం దొరికినా లలిత చావుకు, నాకు ముడిపెట్టరు. మా ఇద్దరికీ సంబంధం ఉందని తెలిసినవాళ్లే చాలా తక్కువ. వాళ్లయినా ఈ రోజు జరిగినది ఊహించలేరు. కుమారి కూడా పైన నిద్రపోతోంది. నీ సహాయం ఉంటే చాలు. కార్లో శవాన్ని పట్టుకెళ్లి కొండల్లో పడేద్దాం. ఏక్సిడెంటో, ఏదో అనుకుంటారు. తాగి ఉంది కదా, తలకు దెబ్బ తగిలింది కూడా. అదంతా ఏక్సిడెంట్ వల్లనే అనుకుంటారు!"

"ఇన్నాళ్లూ మీకు ప్రేమ పంచి ఇచ్చింది కదా, ఈ రోజు ఆమె శవాన్ని దిక్కుమాలినదానిలా బయటపడేస్తారా?" అంది సూరమ్మ నిష్ఠూరంగా.

"సూరమ్మా! నన్ను అర్థం చేసుకో. నేను చేస్తున్నది నన్ను నేను కాపాడుకోడానికి!" అన్నాడు డాక్టరు.

"నేను కూడా నన్ను కాపాడుకోవాలి కదా! మీ రహస్యం తెలిసినదాన్నని మీరెన్నడైనా నాపై అఘాయిత్యం తలపెడితే...?"

"ఛ!ఛ! అలాంటివాడినా నేను? నీ పేర విల్లులో ఆస్తి రాస్తానని అంటిని కదా!"

"విల్లు దాకా ఎందుకులెండి, అదేదో ఇప్పుడే ఇచ్చేస్తే మంచిదిగా!" అంది సూరమ్మ అతి కూల్‌గా.

డాక్టరు నిర్ఘాంతపోయి చూశాడు సూరమ్మవంక. తల పంకించాడు. "సరే, కానీ నా దగ్గర డబ్బులేదు!" అన్నాడు.

"చెక్కు ఇచ్చినా ఫర్వాలేదు!" అంది సూరమ్మ తొణక్కుండా.

మారు మాట్లాడకుండా డాక్టరు చెక్కు ఇవ్వడం, అతనూ, సూరమ్మా కలిసి శవాన్ని ఆమె కార్లో

వేసుకుని దూరంగా వెళ్లి ఎత్తయిన ప్రదేశం నుండి ఆమె కారును తోసేయడం, ఇంటికి తిరిగొచ్చి సూరమ్మ నేలంతా కడిగివేయడం జరిగింది. చివరికి "అంతా సవ్యంగానే ఉందిగా!" అన్నాడు డాక్టరు.

"ఆహాఁ, మీ కోటుమీద పడ్డ రక్తపు మరకలు తప్ప!" అంది సూరమ్మ.

డాక్టరు ఉలిక్కిపడ్డాడు. వెంటనే కోటు విప్పి ఆమె చేతికిచ్చి "వెంటనే ఉతికేయ్!" అన్నాడు.

కానీ సూరమ్మ దాన్ని ఉతకలేదు. మర్నాడు బ్యాంక్‌కెళ్లి చెక్కు మార్చి డబ్బు తీసుకోగానే ఆ కోటుతో సహా లలిత భర్త వద్దకు వెళ్లింది.

"కాద్దిసేపట్లోనే మీ భార్య శవం బయటపడుతుంది. ఏక్సిడెంటనే అందరూ అనుకుంటారు. కానీ కాదని నేను నిరూపించగలుగుతాను, డాక్టరు గారి కోటు కారు సీట్లో పడేయడం ద్వారా, విచారణలో అన్ని విషయాలు బయటకొస్తాయి. మీ భార్యకూ, డాక్టరుకు నడిచిన అక్రమ సంబంధం కూడా నలుగురి నోళ్లలో నానుతుంది!" అంది.

లలిత భర్త బిజినెస్‌మన్. ఏ విషయాన్నైనా త్వరగా ఆకళింపు చేసుకోగల సమర్థుడు. భార్య ఎవరితోనో తిరుగుతోందనే అనుమానమే తప్ప ఇదమిత్థంగా తెలియలేదు ఇన్నాళ్లూ. బతికుండగానే కాకుండా చచ్చి కూడా సాధిస్తున్నట్టుంది లలిత అనుకుని. "ఆ కోటు ఎంతకు అమ్ముతావు?" అన్నాడు సూరమ్మతో. "లక్ష!" అంది సూరమ్మ. రెడీ కాష్ ఉంది అతనివద్ద.

సాయంత్రానికి శవం బయటపడింది. యోగేష్‌కి డాక్టరుమీద అనుమానం పోయింది. డాక్టరు ప్రియురాలు లలితో, కాదో చెప్పగలిగేది సూరమ్మే. కానీ ఆమె దొరకలేదు. డాక్టరు తరఫున ఆయన చెక్కు ఎన్‌కాష్ చేసిందని, తర్వాత కనబడలేదని తెలిసింది. ఆమె నిజాయితీ తెలుసు కాబట్టి డాక్టరుని ఆమె బ్లాక్‌మెయిల్ చేసి ఉంటుందనే వాదన కొట్టిపారేశాడు యోగేష్. హత్యానేరం తనమీదకు వస్తే పారిపోవడానికి వీలుగా డాక్టరు సూరమ్మ ద్వారా డబ్బు తెప్పించుకుని, ఆ తర్వాత ఆమెను కూడా చంపిపారేసి ఉంటాడని అనుకున్నాడు యోగేష్. కానీ దేనికీ సాక్ష్యాలు లేక కేసు పెట్టలేకపోయాడు.

హైదరాబాదులో పెద్ద హోటల్లో దిగిన సూరమ్మ తన చేతిలో ఉన్న ఐదువేల రూపాయల కట్టను ఆత్మీయంగా చూసుకుంది. అది మొట్టమొదటిసారి దొరికినది ఆమె పనిచేసే బార్‌లో. అక్కడ డాన్స్ చేస్తూండగానే విక్రమ్ జేబులోంచి పడుతూండగా చూసింది. డాన్స్ కాగానే వెళ్లి అతనికిచ్చింది. ఆమె నిజాయితీకి ముగ్ధుడయ్యాడతను. వాళ్లిద్దరి మధ్య ప్రేమ అంకురించింది. నెల్లాళ్లలో పెళ్లయింది. పెళ్లికి బహుమతిగా ఆ అయిదువేల రూపాయల కట్ట అలాగే భార్యకు ఇచ్చాడు విక్రమ్. స్వతహాగా డబ్బున్నవాడే అయినా జూదంలో చాలా పోగొట్టుకున్నాడు. అయినా అతనంటే ఎంతో ప్రేమ తనకి. ఎన్నో జీవిత సత్యాలు చెప్పేవాడు. గొప్పవాళ్లకు దగ్గరలో ఉండటం మంచిదని, వాళ్లు ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒకదానిలో ఇరుక్కోక తప్పదనీ అంటూండేవాడు. అందుకే ప్రతిసారీ ఆమె గొడవలొచ్చే అవకాశం ఉన్న ఇళ్లనే వెతుక్కునేది. జూదానికి అన్వయించి మరొక సత్యం కూడా చెప్పేవాడతను. గెలుపులో ఉండగా ఆట మధ్యలో ఆపకూడదని అనేవాడతను. అందుకే ఆ ఊళ్లో బాగా డబ్బున్నవాళ్ల లొకాలిటీ ఏదీ అని వాకబు చేసిందామె హోటల్ బాయ్‌ను.

రెండు రోజులు గడిచాయి.

"ఇవాళ మీ పత్రిక్కి మంచి విశేషం చెప్తానయ్యా, సూరమ్మ అని ఒక నిజాయితీపరురాలు మా పోలీస్‌స్టేషన్‌కి వచ్చింది. ఒకటీ, రెండు కాదు అక్షరాలా అయిదువేల రూపాయలు దొరికితే పట్టుకొచ్చి ఇచ్చింది. మనిషిని చూస్తే చింకిబట్టలూ, అదీ... దమ్మిడీ లేనట్టుంది. అయినా ఐదు వేలు కనబడగానే ఆశపుట్టి దగ్గర ఉంచేసుకోకుండా. స్వంతదారులకు అప్పచెప్పేయండి అంటూ నా దగ్గరకు వచ్చింది. లోకంలో నీతి, నిజాయితీ ఇంకా బతికే ఉన్నాయని మీ పత్రికలో రాయవయ్యా!" అన్నాడు లక్ష్మీపురం పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్ రాజామణి.